అలరించిన నృత్య ప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం బెంగుళూరుకు చెందిన గుణశ్రీ, హైదరాబాద్‌కు చెందిన సుభాషిణీ గిరిధర్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన సందర్శకులను అలరించింది. ఇందులో నర్తన గణపతిం, శృంగార లహరి, మరకతమణిమయ అంశాలను ప్రదర్శించారు. గణేశా, కార్తికేయ, నటేశకౌతం, నగుమోము తిల్లాన అంశాలను కళాకారులు సుభాషిణీ గిరిధర్, సుదీతి, అనన్య, మాన్విత, అన్విక, మీరా, వైభవి ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం నృత్యోపచార శిక్షణాలయ శిష్యబృందం తొదయ మంగళం, వేంకటాచల నిలయం, విషమకర, బ్రహ్మమొక్కటే, మధుర మధుర, కదన కుతూలం తదితరాలతో ఆకట్టుకున్నారు. కళాకారులు శ్రేయ కల్లూరి, అనన్య కృష్ణకుమార్, నందిని, శ్రీపతి, సుభి, నిషిక, రిషిక శ్రీధర్, స్వాతి కార్తీక విఘ్నేష్, అదితి కార్తీక విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.




బూత్‌స్థాయిలో పటిష్ఠంగా ఉంటే గెలుపు తథ్యం

- బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి
- చందానగర్‌లో నియోజకవర్గ బూత్‌స్థాయి నాయకుల సమావేశం



చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్స్‌లో సమావేశంలో మాట్లాడుతున్న విశ్వేశ్వర్‌రెడ్డి

హఫీజ్‌పేట్: దేశ ప్రజల హృదయాలు గెలిచిన గొప్ప నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అని బీజేపీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి కొండ విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం చందానగర్‌లోని క్రిస్టల్ గార్డెన్స్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గం పార్టీ బూత్ స్థాయి నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల కన్వీనర్ మల్లారెడ్డి, శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండ విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు 50 రోజులు కష్టపడితే చేవెళ్లలో కాషాయ జెండా ఎగరవేద్దామన్నారు. బూత్‌స్థాయిలో పటిష్ఠంగా ఉంటే బీజేపీ గెలుపు తథ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో సోషల్ మీడియా పాత్ర చాలా కీలకమని కార్యకర్తలు సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండాలన్నారు. బూత్ స్థాయి నాయకులు ప్రతి ఇంటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ ప్రభారీ గిరిమోని శ్రీనివాస్, కన్వీనర్ రాఘవేందర్‌రావు, కో కన్వీనర్ మణిభూషణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నరేష్, నరేందర్ రెడ్డి, సురభి రవీందర్‌రావు, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నాగేశ్వర్ గౌడ్, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు హనుమంత్ నాయక్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ వసంత్‌కుమార్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, అల్లూరి రామరాజు, మాజీ కార్పొరేటర్ నవతరెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్లు, నియోజకవర్గం డివిజన్ల అధ్యక్షులు, ఏబీవీపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో అక్రమ నిర్మాణాలు



చందానగర్ గంగారం పెద్ద చెరువు పరిధి వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ మంజుల

- అనుమతులిచ్చిన అధికారులపై చర్యలు
- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్: చందానగర్ గంగారం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లలో భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం గంగారం పెద్ద చెరువులో అక్రమంగా మట్టి పోసి పూడుస్తున్న వైనాన్ని, నిర్మించిన భవనాలను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగారం చెరువులో సుమారు 3 ఎకరాల వరకు అక్రమార్కులు మట్టితో పూడ్చి యథేచ్ఛగా కబ్జాకు పాల్పతున్నారన్నారు. ఇప్పటికే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో 65 వరకు అక్రమ నిర్మాణాలు గుర్తించామన్నారు. మరో 10 అక్రమ భవన నిర్మాణాలకు దొడ్డిదారిన జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. చెరువు చుట్టు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ సరిహద్దులు నిర్ణయించి చెరువును రక్షించాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే చెరువు సుందరీకరణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు, నాయకులు నరేందర్, వరలక్ష్మి, అవినాష్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ అక్రమాలపై ఫిర్యాదు

శేరిలింగంపల్లి: ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలకు పాల్పడిన రేషన్ డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ మాచన రఘునందన్ తెలిపారు. శేరిలింగంపల్లి తారానగర్‌లోని చౌక ధరల దుకాణం (346)లో ఉండాల్సిన నిల్వలు మాయం అయ్యాయని, 90 క్వింటాళ్ళకు పైగా బియ్యానికి లెక్కలు లేవన్నారు. ఆ డీలర్‌పై చర్యలు తీసుకోవాలని చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రఘునందన్ తెలిపారు. అక్రమాలకు పాల్పడిన వారి డీలర్‌షిప్ రద్దు చేస్తామని హెచ్చరించారు.




రాంగ్ రూట్‌లో..

జాతీయ రహదారిపై యూటర్న్‌ల వద్ద అడ్డదారిలో ప్రయాణిస్తున్న వాహనదారులు

మియాపూర్: మియాపూర్-చందానగర్ జాతీయ రహదారిలో యూటర్న్‌ల వద్ద వాహనదారులు అడ్డదారిలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికితోడు ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు కూడా రాంగ్ రూట్‌లో వెళుతున్నాయి. దీంతో నేరుగా వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా సిగ్నల్స్ తీసివేసి అక్కడక్కడ యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులు రాంగ్ రూట్‌లో యూటర్న్‌ల వద్ద రోడ్డు దాటుతున్నారు.

- మియాపూర్-చందానగర్ జాతీయ రహదారిపై సంతోష్ దాబా ముందు, మదీనాగూడలోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ ముందు, దీప్తి శ్రీనగర్, స్వాగత్ హోటల్, అనూ ఫర్నీచర్‌ల ముందు, చందానగర్ గంగారంలోని కేఎల్ఎం సమీపంలో ఉన్న యూటర్న్‌ల వద్ద

ట్రాఫిక్ ఇబ్బందులు ...తరచు ప్రమాదాలు

అధిక సంఖ్యలో వాహనదారులు ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకోకుండా దగ్గరలో ఉన్న యూటర్న్‌ల నుండి రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. రాంగ్ రూట్‌లో రోడ్డు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎక్కడ పడితే రాంగ్ రూట్‌లలో వెళ్లి వాహనదారులకు ఇబ్బందులు కలగజేస్తున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలు ఆగిపోవాల్సి వస్తోంది.

- మియాపూర్, చందానగర్ ప్రాంతాలు జాతీయ రహదారి కావడంతో వాహనాల రాకపోకలు అధికంగా ఉన్నాయి. ట్రాఫిక్ వ్యవస్థ క్రమబద్ధీకరణలో ట్రాఫిక్ పోలీసులు పలు మార్పులు చేశారు. వాహనాలు వేగంగా ముందుకు సాగాలనే ఉద్దేశ్యంతో జాతీయ రహదారిపై యూటర్న్‌లు ఏర్పాటు చేశారు. మియాపూర్ నుండి బీహెచ్ఇఎల్ కూడలి వరకు పలుచోట్ల యూటర్న్‌లు పెట్టారు. గతంలో కంటే వాహనాల సంఖ్య పెరగడమే కాకుండా ప్రధాన రహదారి కావడంతో వేగంగా వెళ్తుంటాయి. యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులు అదుపు చేయలేకపోతున్నారు. దీనివల్ల యూటర్న్‌ల వద్ద రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలు నేరుగా వచ్చే వాహనాలను ఢీకొంటున్నాయి.
- యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ సిబ్బంది కనిపించడం లేదు. రాంగ్ రూట్‌లో వచ్చే వారిని నియంత్రించే వారు లేకపోవడంతో యూటర్న్‌ల వద్ద ఎవరికి వారు ఇష్టానుసారంగా పోతున్నారు. ద్విచక్ర వాహనాలతో పాటు కార్లు, ఆటోలు అదే విధంగా దీప్తిశ్రీనగర్ యూటర్న్ వద్ద చెత్త ఆటోలు, చెత్త లారీలు కూడా అధికంగా రాంగ్‌రూట్‌లో చందానగర్ వైపు వెళ్తుంటారు.ట్రాఫిక్ పోలీసులు మాత్రం రాంగ్ రూట్‌లో వెళ్తున్న వాహనాలను ఫొటోలు తీస్తున్నారే తప్ప రాంగ్‌రూట్‌లో వాహనాలను వెళ్లనివ్వకుండా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.
- యూటర్న్‌ల వద్ద వాహన చోదకులకు సూచనలు, రాంగ్ రూట్‌లో వచ్చే వారిని నియంత్రించేందుకు ట్రాఫిక్ సిబ్బందిని నియమించి అవగాహన కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.




25న 'నిథమ్'లో హోలీ వేడుకలు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజమ్ అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్)లో ఈనెల 25వ తేదీన హోలీ వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.కుటుంబ సభ్యులంతా పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కలర్స్ రెయిన్‌డ్యాన్స్, డీజే, లైవ్ బ్యాండ్ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తారు. ప్లేబ్యాక్ సింగర్ ఇండియన్ ఐడల్ ఫైనలిస్ట్, నిథమ్ పూర్వ విద్యార్థి ఆదిత్య భీమథాటి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కూడా ఏర్పాటు చేశామన్నారు.

మోదుగ అందాలు



రాయదుర్గం: గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మోదుగు పూలు విరగబూసి ఆకర్షిస్తున్నాయి. హోలీ వేడుకలకు మోదుగపూలకు అవినాభావ సంబంధం ఉందంటారు. హోలీ సమయానికి ఈ పూలు విరగబూస్తాయి. మోదుగ పూలతో తయారు చేసిన రంగులు చల్లుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదని పలువురు పేర్కొంటున్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వద్ద 1.8 కిలోల గంజాయి స్వాధీనం

మాదాపూర్: ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వద్ద రూ.55వేలు విలువ చేసే 1.8 కిలోల గంజాయిని ఎస్‌ఓటీ బాలానగర్ టీం స్వాధీనం చేసుకుని మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీ, తూర్పుగోదావరి జిల్లా ,రావులపాలెం, కొత్తపేటకు చెందిన యాపుగంటి ఫణికిరణ్ (28) సినర్జిస్టిక్ సొల్యూషన్స్‌లో నెట్‌వర్క్ ఇంజనీర్‌గా పని చేస్తు మాదాపూర్‌లోని ఖానామెట్ ప్రైవేటు హాస్టల్‌లో నివాసముంటున్నాడు. కొద్ది రోజుల క్రితం గంజాయి సరఫరాదారు నాగు వైజాగ్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి దానిని చిన్న పౌచ్‌లుగా మార్చి అవసరమైన వ్యక్తులకు విక్రయిస్తాడు. అతని వద్ద కొనుగోలు చేసినట్టు తెలుసుకున్న పోలీసులు నిందితున్ని అదుపులోకి తీసుకున్నారు. గతంలో ఇతనిపై ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఎన్‌డీపీఎస్ కేసులో అరెస్ట్ అయినట్టు తెలిపారు.

రంజిత్‌రెడ్డి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్ రెడ్డి గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్ పిలుపునిచ్చారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని వివేకానందనగర్ డివిజన్‌లోని పీజేఆర్ ఫంక్షన్‌హాలులో శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు విద్యాకల్పన, ఏకాంత్‌గౌడ్‌లు ఏర్పాటు చేసిన సమావేశంలో జగదీశ్వర్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వం రుణపడి ఉంటుందని, అన్ని వర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం భరోసా ఇవ్వటం హర్షించదగ్గ విషయమన్నారు. సీనియర్ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, కూన సత్యం, బాషిపాక నాగమణి యాదగిరి, ముకయ్య, వెంకటస్వామి సాగర్, ఆల్వాల భాస్కర్, లక్ష్మీ, మల్లేష్, మంజు పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటే ఉద్యోగావకాశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎం మనోజ్‌కుమార్

ఐసీఏ సౌత్ ఇండియా రీజినల్ మేనేజర్ మనోజ్‌కుమార్

పటాన్‌చెరు: కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలకు కొదవలేదని ఐసీఏ(ఇండియన్ కామర్స్ అకాడమీ) సౌత్ ఇండియా రీజినల్ మేనేజర్ మనోజ్ కుమార్ అన్నారు.శనివారం పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగాలు సాధించడానికి కావల్సిన నైపుణ్యం గురించి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మనోజ్ కుమార్ మాట్లాడుతూ... విద్యార్థులు జీఎస్టీ, ఐటీ, ట్యాలీపై పట్టు సాధిస్తే ఉద్యోగ అవకాశాలకు కొదువ లేదని మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగాలు సులువుగా వస్తాయన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అల్లం రెడ్డి ,కామర్స్ విభాగాధిపతి రాజిరెడ్డి, నరేందర్, రవీందర్, కృష్ణ పాల్గొన్నారు.

'ఎస్కీ'లో ముగిసిన శిక్షణ

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో మూడు రోజుల శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. మూడు రోజుల పాటు పాండేచ్చేరి యూనివర్శిటీకి చెందిన 83 మంది విద్యార్థులు, ఫ్యాకల్టీ ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా స్కిల్ శిక్షణతోపాటు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా ఎనలైటిక్స్ వంటి అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మాట్లాడుతూ ప్రస్తుతం పోటీ ప్రపంచంలో ఉద్యోగం సాధించాలంటే, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధన చేయాలంటే బ్లాక్ చెయిన్ టెక్నాలజీ తదితర అంశాలపై అవగాహన అవసరమన్నారు. అనంతరం సర్టిఫికెట్లు ఇచ్చారు.

అవుట్ డోర్ రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ

గచ్చిబౌలి: ఒలింపిక్‌లో రాక్ క్లైంబింగ్‌కు అవకాశం ఉండటంతో అవుట్ డోర్ రాక్ క్లైంబింగ్‌లో నైపుణ్యం పెంపొందించాలని క్రాగ్ స్పోర్ట్ క్లైంబింగ్ స్టూడియో నిర్వాహకులు రంగారావు తెలిపారు. శనివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాక్ క్లైంబర్స్‌కు ఓపెన్ మైక్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్న సహజ వనరులను వినియోగించుకొని రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. దక్కన్ పీఠభూమి రాక్స్‌తో నిండి ఉందని, వాటిని ఉపయోగించుకొని రాక్‌క్లైంబింగ్ ఒలింపిక్ స్పోర్ట్స్‌ను అభివృద్ధి చేస్తున్న సంస్థలకు ప్రభుత్వం సహకారం అందించాలన్నారు. హైదరాబాద్ క్లైంబర్స్, ఖాజాగూడ, కొండమడుగు, పాండవుల గుట్ట తదితర ప్రాంతాలలో అవుట్ డోర్ రాక్ క్లైంబింగ్ చేస్తున్నారని చెప్పారు. భువనగిరిలో రాక్ క్లైంబింగ్ స్కూల్, అవుట్ డోర్ ప్రాజెక్ట్, సొసైటీ టూ సేవ్‌రాక్ సంస్థలు రాక్ క్లైంబింగ్‌లో శిక్షణ ఇస్తున్నాయని తెలిపారు.

ఆర్‌యూబీ.. ట్రాఫిక్ సమస్య

సిగ్నల్ ఏర్పాటు చేసినా తప్పని ఇబ్బందులు



విద్యుత్ నగర్ కాలనీ నుంచి తెల్లాపూర్ వెళ్లే మార్గంలో రైల్వే అండర్ బ్రిడ్జ్

రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీ నుంచి తెల్లాపూర్‌కు వెళ్లే మార్గంలో ఉన్న అండర్ బ్రిడ్జ్ కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్య తప్పడం లేదని ప్రజలు వాపోతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు ఈ రైల్వే అండర్ బ్రిడ్జ్ విస్తరణకు కృషి చేస్తామని హామీలు ఇచ్చారని నేటికీ అమలు కాలేదని తెలిపారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు కాలనీలు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. దీంతో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు భారీగా పెరిగాయి. ఉదయం సాయంత్రం సమయాల్లో అనేక స్కూల్ బస్సులు ఈ మార్గం నుంచే రాకపోకలు సాగిస్తున్నాయి. అలాగే ఐటి ఉద్యోగులు ఎక్కువగా వస్తూపోతుంటారు. వాహనాల రద్దీకి తగ్గట్టుగా ఈ అండర్ బ్రిడ్జ్ లేకపోవడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు. ఈ విషయాన్ని గతంలో స్థానికులు ఉన్నతాధికారుల దృష్టికి, స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో గత ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి రైల్వే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా రైల్వే అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. రైల్వే అండర్ బ్రిడ్జి విస్తరణకు హామీ ఇచ్చారు. ఐతే నిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొనడంతో మున్సిపల్ అధికారులు గతంలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. దీనికి తోడు తెల్లాపూర్ వరకు ఎంఎంటీఎస్ రైలు రావడంతో స్థానికులు రైల్వేస్టేషన్ సమీపంలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. అక్కడ బ్రిడ్జిని ఏర్పాటు చేయడం వల్ల రింగ్‌రోడ్, పటాన్‌చెరు వైపు వెళ్లడానికి సులభంగా ఉంటుందని ప్రజలు అంటున్నారు.కాగా విద్యుత్‌నగర్ కాలనీ నుంచి తెల్లాపూర్‌కి వెళ్లే మార్గంలోని రైల్వే అండర్ బ్రిడ్జి వెడల్పు చేసేందుకు టీయూఎఫ్ఐడీయూసీ కింద రూ.5 కోట్ల ప్రతిపాదనలను మున్సిపల్ అధికారులు గత నెల రోజుల క్రితం జిల్లా ఉన్నతాధికారులు పంపించారు .ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నిత్యం ఇబ్బందులే..

నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు రైల్వే అండర్ బ్రిడ్జి నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళలో ఈ మార్గంలో రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని అధికారులు రైల్వే అండర్ బ్రిడ్జ్‌ను వెడల్పు చేస్తే రాకపోకలకు ఎంతో సులువుగా ఉంటుంది.

–రాజేష్ చారి, ఐటీ ఉద్యోగి

ఎక్కడ పడితే అక్కడ..

మణికొండ: ఇంటి ఆవరణలో వేసుకోవాల్సిన బోర్లు ఏకంగా ఫుట్‌పాత్‌లు, రోడ్లపైనే వేస్తున్నారు. ఉన్న బోర్లు వట్టిపోకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించడం లేదు. వేసవి కావడంతో మణికొండ మున్సిపాలిటీ పరిధిలో అనేక అపార్ట్‌మెంట్‌లు, గృహాలలో బోర్లు వట్టిపోయాయి. జల మండలి సరఫరా చేస్తున్న నీరు సరిపోకపోవటం, గృహాలు, అపార్ట్‌మెంట్‌లలో బోర్లు వేసే పరిస్థితి లేకపోవటంతో రోడ్ల పక్కన, ఫుట్‌పాత్‌లపైన వేస్తున్నారని పంచవటి కాలనీవాసులు వాపోతున్నారు. కొత్తగా బోరు వేయాలంటే దానికి 100 మీటర్ల దూరం వరకు ఎలాంటి బోరు ఉండకూడదు. అలా ఉంటే వారి నుంచి నిరభ్యంతర పత్రం, భూగర్భజల శాఖ వారు అక్కడ నీరు వస్తుందని ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో రెవెన్యూ అధికారులకు కొత్త బోరు వేసుకునేందుకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారు పరిశీలించి సరైన స్థలం ఉంటే బోరు వేసుకునేందుకు అనుమతులను జారీ చేస్తారు.అయితే అవేమీ లేకుండా ఎవరిష్టం వచ్చినట్టు వారు ఎక్కడ పడితే అక్కడ బోర్లు వేస్తున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారని మణికొండ మున్సిపాలిటీ, పంచవటి కాలనీవాసులు వాపోతున్నారు. ఇకనైనా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

కిందికుంట పార్కులో వసతులు కల్పిస్తాం

కార్పొరేటర్ శ్రీనివాసరావు



సమస్యలను తెలుసుకుంటున్న శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కిందికుంట పార్కులో వాకర్స్‌తో కలిసి కార్పొరేటర్ శ్రీనివాసరావు శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిందికుంట పార్కులో వాకర్స్ ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నామన్నారు తగిన వసతులను కల్పిస్తామని చెప్పారు. రాబోయే తరాలకు పచ్చదనాన్ని ఇవ్వడానికి మనవంతు బాధ్యతగా స్థానికులు పార్కును సంరక్షించుకోవాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై బస్తీలలో అవగాహన



బస్తీ వాసులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఆర్‌పీ భరత్, శానిటేషన్ సిబ్బంది

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో శనివారం బస్తీ మీటింగ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్‌పీ భరత్ మాట్లాడుతూ మహిళల సహకారంతో పరిసరాలు శుభ్రంగా ఉంటాయని, వారు చెత్తను స్వచ్ఛ ఆటోలలో వేయాలని కోరారు. రోడ్లపై చెత్త వేయడం వలన రోడ్లు అపరిశుభ్రంగా మారతాయని, స్వచ్ఛ ఆటోలు బస్తీలకు రాకపోతే తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో లింగంపల్లి బస్తీవాసులు, నాయకులు దేవులపల్లి శ్రీనివాస్, కృష్ణ యాదవ్, ఎస్ఎఫ్ఏలు తిమ్మప్ప, మహమ్మద్ జిలాని, రాజేష్‌యాదవ్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

కాలనీవాసుల నిరసన



కమ్యూనిటీహాల్ ఎదుట నిరసన తెలుపుతున్న మ్యారీగోల్డ్ వాసులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని లెజెండ్ మ్యారీగోల్డ్ విల్లాస్‌లో కమ్యూనిటీ హాల్‌కు తాళం వేశారంటూ మ్యారీగోల్డ్ వాసులు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా లెజెండ్ మ్యారీ గోల్డ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి క్రాంతి, ఉపాధ్యక్షులు వినోద్, కోశాధికారి శరత్‌లు విలేకరులతో మాట్లాడుతూ 2014 నుంచి కమ్యూనిటీ డెవలప్ చేసుకున్నామని, కొన్ని ప్లాట్ల యజమానులు అసోసియేషన్‌కు సంబంధించిన కమ్యూనిటీహాల్‌కు తాళం వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకీ, సౌజన్య, ప్రియాంక, శరణ్య, ఉమాదేవి, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో 'ఐకాన్ ఫ్రేమ్'



మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం కళాకారుడు విక్రమ్‌రాజ్ చిత్రప్రదర్శనను ఐకాన్ ఫ్రేమ్ పేరిట ఏర్పాటు చేశారు. చిత్రాలు అద్భుతంగా ఉన్నాయని సందర్శకులు కొనియాడారు. ఈ నెల 26వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

మెడికవర్‌లో సైబర్ క్రైంపై అవగాహన

మాదాపూర్: మెడికవర్ ఆస్పత్రిలో సైబర్ క్రైం అవేర్‌నెస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నందా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సమర్థవంతమైన నివారణ చర్చలపై చర్చించారు. విశిష్ట ప్యానెల్, లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, న్యాయనిపుణులు తమ అభిప్రాయాలను తెలిపారు. కార్యక్రమంలో మెడికవర్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయసాధనకు కృషి చేయాలి

మియాపూర్: భగత్‌సింగ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్ అన్నారు. ఏఐఎఫ్‌డివై ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజగురు సుఖదేవ్‌ల వర్ధంతిని ఎంఏనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంసీపీఐయూ, చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి వనం సుధాకర్ మాట్లాడుతూ భగత్‌సింగ్ రాజగురు, సుఖదేవ్‌ల ఆశయ స్ఫూర్తితో సాగాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంసీపీఐయూ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.